www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 జులై 2024
5
తిరుపతి



నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వండి: ఆర్సి మునికృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



గత వైసిపి ప్రభుత్వం పెట్టిన ఎన్నో కష్టనష్టాలను, బాధలను ధీటుగా ఎదుర్కొని పార్టీ కోసం శ్రమించానని, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తిరుపతి నగరపాలక సంస్థ 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్ సి మునికృష్ణ కోరారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందించారు. సామాన్య కార్యకర్త స్థాయి నుండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా మెలుగుతూ వచ్చానన్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని తగిన ప్రాధాన్యత తప్పక కల్పిస్తామని అధ్యక్షులు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమం లో 35వ డివిజన్ అధ్యక్షులు ఎస్సెం శ్రీధర్, జనరల్ సెక్రెటరీ జగన్నాథం, 27వ డివిజన్ అధ్యక్షులు నాగప్రతాప్, సుబ్రహ్మణ్యం నాయుడు, పండు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో...
డబుల్ డె(ట)క్కర్..!



ఇంకొన్నాళ్లు వదిలేస్తే 'స్క్రాబ్'లోకే...
వైసిపి హయాంలో అభినయ్ హంగామా
రిజిస్ట్రేషన్ లేకనే రోడ్లపై చక్కర్లు
తాము 'భరించలేమంటున్న' ఆర్టీసీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఎంత హంగామా..ఏమి ఆర్భాటం.. డబుల్ డెక్కర్ బస్సు తిరుపతికి వచ్చింది న్యూస్.. గంగమ్మకు పూజలు చేసింది న్యూస్.. రోడ్లపై తిరిగింది బ్రేక్.. మాస్టర్‌ప్లాన్ రోడ్లలోనే తిరగబోతున్నది హైలెట్.. చివరికి డంపింగ్‌యార్డులో ఉన్నది, ఇంకొన్నాళ్లు ఇలాగే వదిలేస్తే 'స్క్రాబ్'లోకే అన్నది హెడ్‌లైన్..' డబుల్ డెక్కర్ బస్సు వైసిపి హయాంలో నగర పాలకులు ఓ ఊపు ఊపింది. ప్రస్తుతం 'చెత్త'లో సేద తీరుతోంది.. అంతా మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ 'స్టీరింగ్' తిప్పారు.. ఎవరైనా చిన్న బండి కొన్నా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.. అలాంటిది అంత పెద్ద బస్సుకు రిజిస్ట్రేషన్ లేకుండా పోయింది.. అనుమతి లేకుండా రహదారుల్లో రెండు మూడు నెలపాటు చక్కర్లేసింది.. కనీసం ఆ బస్సును ఆర్టీసీ వాళ్లైనా తీసుకుని తిప్పాలని కోరితే 'మా కొద్దు బాబోయ్ ఆ తెల్ల ఏనుగు' అంటూ చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం డంపింగ్‌యార్డులో ఉంది.. రూ.2కోట్ల 30 లక్షల రూపాయల 'చివరకు' చెత్తలో పోసినట్టయ్యింది.. ఇదంతా ఎవరికోసం, ఎందుకోసం అంటే అభినయ్‌రెడ్డే సమాధానం చెప్పాలి.. ప్రజల సొమ్ము దుర్వినియోగం చేసినందుకు కౌన్సిల్ మొత్తం బాధ్యత వహించాలి.

కార్పొరేషన్ అంటే ఏ దోమల మందో, యుడిఎస్ పనులకో, తాగునీటి శుద్ధికో నిధులు కేటాయించాలి.. తిరుపతి కార్పొరేషన్ వారు ఏకంగా 'డబుల్ డెక్కర్' బస్సును ఏం చేద్దామని కొన్నారో తెలియదు. రూ.కార్పొరేషన్ ఖజానా నుంచి రూ.2కోట్ల 30 లక్షలతో కొనుగోలు చేశారు. తిరుపతి గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మేయర్‌తో పాటు 50 మంది కార్పొరేటర్లు నగరమంతా ఈ బస్సులో చుట్టి వచ్చారు. సెల్ఫీలు తీసుకోడానికి తప్ప జనాదరణ పొందలేకపోయింది ఈ డబుల్ డెక్కర్. మాస్టర్‌ప్లాన్ రోడ్లలో తిరిగేలా అప్పటి మాజీ ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిలు ఆర్టీసీతో చర్చలు జరిపారు. బస్సుకు అడ్డం వచ్చిన వందలాది చెట్లను నరికేశారు. అయితే ఎలక్ట్రికల్ డబుల్ డెక్కర్ బస్సును రద్దీలేని మాస్టర్‌ప్లాన్ రోడ్లో నడపలేమని ఆర్టీసీ అధికారులు తేల్చి చెప్పేశారు. దీంతో కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే డబుల్ డెక్కర్ బస్సును ఉచితంగా నగరంలో తిప్పారు. కరకంబాడి మార్గంలోని ఎస్‌విమ్స్ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి లీలామహల్ మీదుగా, తిరుమల బైపాస్‌రోడ్డు, తిరుచానూరు నుంచి ఎయిర్ బైపాస్‌రోడ్డు మీదుగా పద్మావతి మహిళా యూనివర్సిటీ, ఎస్వీ యూనివర్సిటీ వరకూ 'ఉచిత' సేవలందించారు. అయినా ప్రయాణికుల నుంచి ఆదరణ లేకుండా పోయింది. ఇద్దరు డ్రైవర్లతో పాటు, ఓ సిబ్బందికి జీతం ఇచ్చి మరీ ట్రైల్ వేశారు. ఇంతలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో కార్పొరేషన్ డంపింగ్‌యార్డుకు డబుల్ డెక్కర్ బస్సును తరలించారు. బస్సు కొనుగోలులో 'కమీషన్ల'కు కక్కుర్తిపడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని నగరవాసులు మండిపడుతున్నారు. నగరంలో డబుల్ డెక్కర్ బస్సు నడపాలంటే 60నుంచి 100 అడుగుల రోడ్డు విస్తీర్ణం ఉండాలి. తిరుపతి నగరానికి అంతటి సీన్ లేదనే చెప్పాలి. కేవలం గొప్పలకు పోయి డబుల్ డెక్కర్ కొనుగోలు చేశారన్న విమర్శలు గత ప్రభుత్వంలో వినిపించాయి. ఇటీవల ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు జరిపిన కౌన్సిల్ సమీక్ష సమావేశంలోనూ ఈ బస్సు విషయమై ప్రస్తావన తీసుకురాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే టిడిపి నేతలు ఎంఎల్‌ఎ దృష్టికి తేవడంతో 'డబుల్ డెక్కర్ బస్సును ఎందుకు డంపింగ్‌యార్డులో ఉంచారు' అని ప్రశ్నించారు.

నిర్వహణ తెల్ల ఏనుగుకు లెక్కే..!

ఈ డబుల్ డెక్కర్ బస్సును నడపాలంటే సిబ్బందికి జీతభత్యాలు ఎవరివ్వాలనేది సందేహం. మరోవైపు ఈ బస్సుకు రిజిస్ట్రేషనే ఇప్పటి వరకూ లేదు. ఇటీవల ఆర్టీవో అధికారులు తనిఖీ చేయగా రిజిస్ట్రేషనే లేదని తేలింది. ఈ బస్సు సిటింగ్ కెపాసిటీ మొదటి అంతస్తులో 37 మంది, రెండో అంతస్తులో 30 మంది కూర్చోవచ్చు. టికెట్ ధర రూ.50 ఉంటేనే గిట్టుబాటు అవుతుంది. అయితే ఊరికే నడిపినా ప్రయాణికుల నుంచి డబుల్ డెక్కర్‌కు విముఖతే లభించింది. మరోవైపు ఊరికే ఇస్తామన్నా ఆర్టీసీ అధికారులు తీసుకోడానికి సిద్ధంగా లేరు. ఈ నేపథ్యంలో నగరంలో ఈ బస్సును ఉపయోగించడమో, లేక ఎక్కడ అవసరమో అక్కడికి తరలించడమో చేస్తే కనీసం 'చెత్త యార్డు' నుంచైనా ఆ బస్సుకు విముక్తి లభిస్తుంది.



గూడూరు టవర్‌క్లాక్ వద్ద సిపిఎం నిరసన

బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని, నిధులివ్వని బడ్జెట్‌ను ప్రకటించిందని సిపిఎం నాయకులు జోగి శివకుమార్ ఎద్దేవా చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా గూడూరు టవర్‌క్లాక్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. నాయకులు జోగి శివకుమార్, పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి 15వేల కోట్ల అప్పు ప్రకటించడం దుర్మార్గమన్నారు. దీన్ని గ్రాంట్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని ప్రత్యేక హోదా గాలికి వదిలేసినట్లేనన్నారు. ప్రత్యేక ప్యాకేజీ నిధులేవన్నారు. కేవలం అప్పులతో సరిపెట్టిందన్నారు. పోలవరం నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయింపు లేదన్నారు. కడప స్టీల్, రామాయపట్నం ఓడరేవు, విశాఖ రైల్వేజోన్ ఊసే లేదన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ, ఆహార ధాన్యాలు, ఎరువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సబ్సిడీపై కోత విధించడం దుర్మార్గమన్నారు. నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపుపై చర్యలు లేవన్నారు. అంగన్‌వాడీ, ఆశా స్కీముల్లో కోత విధించారన్నారు. ఉపాధి హామీకి నిధుల కోత పడిందన్నారు. సంపన్నవర్గాలకు ఊడిగం చేసేలా బడ్జెట్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బివి రమణయ్య, ఎస్.సురేష్, పుట్టా శంకరయ్య, చంద్రయ్య, ఎస్.కె మున్నా పాల్గొన్నారు.

'అభ్యుదయానికి' చిరునామా 'అడిగోపుల'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



అభ్యుదయానికి చిరునామా అడిగోపుల సాహిత్యం అని వక్తలు ఉద్ఘాటించారు. అక్షరాలను అస్త్రంగా తెలుగు సాహిత్యానికి అందించారన్నారు. అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభ గురువారం వేమన విజ్ఞాన కేంద్రంలో పలు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో జరిగింది. అడిగోపుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సభకు మల్లారపు నాగార్జున అధ్యక్షత వహించారు. ప్రముఖ రచయిత రాసాని మాట్లాడుతూ కవిత్వానికి నిలువెత్తు సంతకం అని, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించదగిన రచయిత అడిగోపుల అని అన్నారు. సీనియర్ పాత్రికేయులు కొత్తూరు అమరేంద్ర మాట్లాడుతూ అక్షరాలకు ఆయువు పోసిన కృషీవలుడన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ రాబోవు తరానికి ప్రేరణని అన్నారు. తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ అడిగోపుల కవిత్వం రేపటి సమాజాన్ని ఆవిష్కరించిందన్నారు. గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యానికి చెరిగిపోని సంతకం అన్నారు. అడిగోపుల కుమారుడు శ్రీకాంత్ మాట్లాడుతూ తన తండ్రి జీవితాన్ని, సాహితీ జ్ఞాపకాలను విపులంగా పంచుకున్నారు. సాహితీవేత్తలు భూమన్, సాకం నాగరాజు, యువశ్రీ మురళి, ఒ.వెంకటరమణ, పేరూరు బాలసుబ్రమణ్యం, ఎస్వీయూ ఆచార్యులు సత్యనారాయణ, టెంకాయల దామోదరం, నెమిలేటి కిట్టన్న, పొక్కళ్ల సుభద్ర, నడ్డినారాయణ పాల్గొన్నారు.

స్మగ్లింగ్ నిరోధానికి కఠిన చర్యలు: ఎస్పీ సుబ్బరాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లను నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. గురువారం కపిలతీర్థం సమీపంలోని టాస్క్ ఫోర్సు కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులతో సమావేశమై టాస్క్ ఫోర్సు పనితీరును అడిగి తెలుసుకున్నారు. స్మగ్లర్లను నిరోధించడానికి మరిన్ని వ్యూహాలను చేపట్టాల్సి ఉందని సూచించారు. ముఖ్యంగా అడవుల్లోకి వెళ్ళినపుడు ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమాచార వ్యవస్థ వినియోగంపై సూచనలు ఇచ్చారు. కడప, రైల్వే కోడూరు, సానిపాయ సబ్ కంట్రోల్స్ నుంచి జరుగుతున్న ఆపరేషన్ విధానాలను టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ వివరించారు. తరువాత టాస్క్ ఫోర్సు ఆవరణలోని కంట్రోల్ రూమ్, పోలీసు స్టేషన్, అక్కౌంట్స్ ఆఫీసు, రవాణా ఆఫీసు తదితర ప్రాంతాలను ఎస్పి సుబ్బరాయుడు పరిశీలించారు. డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి, ఎసీఎఫ్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


ఏహెచ్‌లో ముగ్గురు పారిశుధ్య కార్మికులపై వేటు!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే చిరుద్యోగులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ రాజకీయ వేధింపులు మొదలైపోయాయి. ముఖ్యంగా స్కీం వర్కర్లు, పారిశుధ్య కార్మికులను గత ఎన్నికల్లో వేరొక రాజకీయ పార్టీలకు పనిచేశారనే అక్కసుతో వారిపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేసేశారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికారం మారగానే రాజకీయ వేధింపులు ఎదుర్కొంటున్న చిరుద్యోగులు ఎక్కువైపోతుండటం గమనార్హం. తాజాగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలోని పారిశుధ్యం విభాగంలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న లోకనాధం, ప్రభాకర్, భువనేశ్వరి అనే ముగ్గురు కార్మికులను రాజకీయ వేధింపులతో నిర్దాక్షిణ్యంగా తొలగించారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మిని వివరణ కోరగా తన దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు. రాజకీయ వేధింపులు తగవని సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య ఖండించారు.

టిటిడి అడిషనల్ ఈఓగా వెంకయ్య చౌదరి

ప్రజాశక్తి -తిరుమల



టీ టీ డీ అదనపు ఈవోగా ఐఆర్ఎస్ అధికారి చిరుమామిళ్ల వెంకయ్య చౌదరిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ అన్ని శాఖల్లో ప్రక్షాళనకు నడుం బిగించింది. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని వాటిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని భావించిన ఏపీ సీఎం చంద్రబాబు తిరుమల నుంచే ప్రక్షాళన మొదలు పెడతానని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీటీడీ అదనపు ఈవోగా ఐఆర్ఎస్ అధికారి వెంకయ్య చౌదరిని ప్రభుత్వం నియమించింది. టీటీడీ కి నియమితులైన వెంకయ్య చౌదరి ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని కస్టమ్స్ కమిషనరేట్, విజయవాడ విభాగంలో కమిషనర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో ఏపీ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీగా పనిచేశారు. 2005 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన వెంకయ్యచౌదరి ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఆయనను డిప్యుటేషన్‌పై ఏపీకి పంపింది.

ప్లవర్ టైయిర్ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

టిటిడి గార్డెన్ డిపార్టుమెంట్‌లో అవసరమైన మేరకు ప్లవర్ టైయిర్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌డబ్ల్యుయుఎఫ్ 'సిఐటియు' గౌరవాధ్యక్షులు గోల్కొండ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ డిమాండ్ చేశారు. వేమన విజ్ఞాన కేంద్రంలో బువారం యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. గార్డెన్ డిపార్టుమెంట్‌లో ఖాళీగా ఉన్న మేనేజర్, ఫీల్డ్‌మెన్, ఫీల్డ్ అసిస్టెంట్, మేస్త్రి పోస్టులను విద్యార్హత కలిగిన వారికి సీనియార్టీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలన్నారు. 1500 మంది ఉండాల్సిన గార్డెన్ డిపార్టుమెంట్‌లో ప్రస్తుతం 250 మంది మాత్రమే ఉన్నారని, వీరిపై అధిక పని భారం పడుతోందన్నారు. ఈ సందర్భంగా టిటిడి గార్డెన్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికయ్యింది. గౌరవాధ్యక్షులుగా గోల్కొండ వెంకటేశం, ఎ.చలపతి, అధ్యక్షులుగా యుగేందరరావు, ప్రధాన కార్యదర్శిగా వెంకట మునిరాజు, కోశాధికారిగా నాదమునిరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.






పేదలకు అన్నదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ పి సి రాయల్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు గురువారం అన్నదానం నిర్వహించారు. స్థానిక గాంధీ రోడ్ లోని ఆ సంఘం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ప్రముఖుల పుట్టినరోజులు, ప్రముఖమైన రోజులలో వస్త్ర దానం, అన్నదానం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి తమ వంతు తోడ్పాటు అందిస్తున్నామన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ సిబ్బంది పేదలకు అన్నదానం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాను ప్రకాష్ రెడ్డి, బండి మధుసూదన్, వెంకటేష్ రాయల్ , తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ ఆఫీసు బంగ్లా వద్ద కస్తూర్బా ట్రస్టు ఆధ్వర్యంలో గతంలో 20 కోట్ల పెట్టుబడి పెట్టి కొన్న స్థలంలో 30 కోట్ల వ్యయంతో భారీ గాంధీ ట్రస్టు భవనాన్ని నిర్మించనున్నామని ఈ సందర్భంగా పిసి రాయల్ వెల్లడించారు.

దొంగ ఓట్ల కేసు దర్యాప్తును వేగవంతం చేయండి : ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



దొంగ ఓట్ల కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా పవన్ కళ్యాణ్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు ఆరణి మదన్ బుధవారం కలిశారు. తిరుపతి నియోజకవర్గ సమస్యలను పవన్ కళ్యాణ్ దష్టికి తీసుకెళ్ళగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అయితే దొంగ ఓట్ల కేసు దర్యాప్తు సాధారణ ఎన్నికల ముందు నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదని పవన్ కళ్యాణ్ దష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్ళగా తాను డిజిపి, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారితో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మరోవైపు టిడిఆర్ బాండ్ల స్కాంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కారణంగా భూమి కోల్పోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందేలా చూడాలని పవన్ కళ్యాణ్ ను కోరినట్లు ఆయన చెప్పారు.



ఆరోగ్యమైన భూమితోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - బాలాయపల్లి

సాగు భూములు ఆరోగ్యంగా ఉంటేనే పంటలలో అధిక దిగుబడి వస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య తెలిపారు. బాలాయపల్లి మండలం ఊట్లపల్లిలో 'ఆత్మ' సహకారంతో ప్రకతి వ్యవసాయంపై ఆయన శిక్షణ ఇచ్చారు. అవసరానికి మించి భూములకు రైతులు రసాయనిక ఎరువులు, కలుపు మందులు వాడకం వలన భూములు జవజీవాలను కోల్పోతున్నాయని వివరించారు. దీనివలన భూములు నిర్జీవమై మున్ముందు సాగుకు పనికి రాకుండా పోతాయని అన్నారు. ఈ పరిస్థితుల నుండి గట్టెక్కడానికి ప్రకతి వ్యవసాయ పద్ధతులు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ వేణుగోపాలరావు, మండల వ్యవసాయ అధికారి శిరీష, సర్పంచి సుధాకర్‌బాబు, వ్యవసాయ సహాయకులు సలీం, ట్రైనర్ స్వర్ణలత పాల్గొన్నారు.

తెరుచుకున్న పెద్దిరెడ్డి ఇంటి ముందు గేట్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మున్సిపల్ నిధులతో వేసుకున్న పబ్లిక్ రోడ్డుకు గేట్లు పెట్టి ప్రజలు తిరగకుండా నిర్బంధించిన గేటును వెంటనే తెరవాలని కొద్దిరోజుల క్రితం తిరుపతి జనసేన నాయకులు నిరసన తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో గురువారం మున్సిపల్ అధికారులు రోడ్డు గేటును తీసి 18, 19 వార్డులైన రాయల్ నగర్, మారుతి నగర్ వాసులకు రోడ్డును అందుబాటులోకి తీసుకొచ్చారు.

జంప్ రోప్ పోటీల్లో బిసిఎం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్(బిసిఎం స్కూల్)లో ఈ నెల 23న నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-12, అండర్-14 బాల బాలికల జంప్ రోప్ పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. జిల్లాస్థాయి అండర్-12, అండర్-14లలో పోటీపడి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్- 12లో బాలికలు-4, బాలురు-6, అండర్-14లో బాలికలు-9, బాలురు-2 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా విద్యార్థులను పిఈటి ప్రమీన, బిసిఎం పాఠశాల వ్యవస్థాపకులు కష్ణమూర్తి నాయుడు అభినందించారు. ఎంపికైన విద్యార్థులు కర్నూలు జిల్లా నంద్యాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్నారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రియా, ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ జంప్ రోప్ పోటీలలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించండి: టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ టిడిపి కమిటీ ఆధ్వర్యంలో ఇన్చార్జ్ పంచాయతీ సెక్రటరీ మురళికి గురువారం నిర్వహించిన గ్రామసభలో వినతి పత్రాన్ని అందించారు. స్థానికంగా దోమల బెడద ఎక్కువగా ఉందని, కాలువలను శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరాను మెరుగు పరచాలని సెక్రటరీకి వినతి పత్రాన్ని అందించారు. వీలైనంత త్వరగా గ్రామంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపుతామని సెక్రటరీ మురళి స్థానిక టిడిపి కమిటీ నాయకులకు చెప్పారు.

తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటలు

ప్రజాశక్తి -తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 8 గంటలు పడుతుండగా, రూ. 300 ప్రత్యేక దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పడుతోంది. ఇక వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 17 కంపార్ట్‌మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు బుధవారం స్వామి వారిని 73,023 మంది భక్తులు దర్శించుకున్నారు. 26,942 మంది భక్తులు తమ తలనీలాలు సమర్పించి వెంకన్నకు మొక్కు తీర్చుకున్నారు. రూ.3.98 కోట్లు శ్రీవారి హుండీ ఆదాయం అని టీటీడీ అధికారులు చెప్పారు.

పిఎసిఎస్‌లకు ఫైవ్‌మ్యాన్ కమిటీలు..?

- ఎరువుల వ్యాపారం తప్పనిసరి
- పదవులొస్తాయని కార్యకర్తల్లో ఆశ

ప్రజాశక్తి - డక్కిలి

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల బలోపేతంపై ప్రభుత్వ దృష్టి ఏమో గాని, నామినేటెడ్ పదవులొస్తాయన్న ఆశ టిడిపి కూటమి కార్యకర్తల్లో నెలకొంది. ఫైవ్‌మ్యాన్ కమిటీలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ, వ్యవసాయ సీజన్‌లో ఎరువులు సహకార సంఘాల్లో అందుబాటులో ఉంచాలని ఆయా సొసైటీల సిఇఒలకు దిశానిర్దేశం చేశారు. అలాగే రైతులకు పంట రుణాల విడుదల్లో జాప్యం జరగకుండా ఫైవ్‌మెన్ కమిటీలు కసరత్తు చేయనున్నాయి.

ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసిపి పాలనలో ఉన్న త్రీమెన్ కమిటీలను రాజీనామా చేయించి, అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమించారు. రైతుల భాగస్వామ్యం లేకుండానే అధికారుల పాలనతోనే రాష్ట్ర ప్రభుత్వం పిఎసిఎస్‌ల పాలన కొనసాగిస్తుందని విమర్శలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర సహకార శాఖ మంత్రి అచ్చంనాయుడు సిఎంతో పలు దఫాలు చర్చలు జరిపి వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఫైవ్‌మెన్ కమిటీలను నియమించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రతి సొసైటీ పరిధిలో కిందిస్థాయి కార్యకర్తలకు పదవులు ఇచ్చినట్లవుతుంది.



వెంకటగిరి నియోజకవర్గంలో వెంకటగిరి, లాలాపేట, యతలూరు, డక్కిలి, గొల్లపల్లి, దగ్గవోలు, అల్తూరుపాడు, మాధవయ్యపాలెం, లింగసముద్రం, మోపూరు, బాలాయపల్లి, యాచవరం, నిడిగల్లు, భైరవరం, సైదాపురం, రాపూరు, కలవాయిల్లో పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ సొసైటీల కార్యవర్గానికి 2018లోనే పదవీకాలం ముగిసింది. అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఏడాదిపాటు పదవీకాలాన్ని పొడిగించింది. 2019లో వైసిపి హయాంలో ఎన్నికలు నిర్వహించకుండా త్రిమెన్ కమిటీలతో సరిపుచ్చింది. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక నియామకాల ప్రక్రియ జరిపేలా జీవో వెలువడుతుందని ఆశావాహులు ఎదురు చూస్తున్నారు.

ఎరువుల అందుబాటుపై మల్లగుల్లాలు

ప్రతి సహకార సంఘంలో ఎరువులు అందుబాటులో ఉంచినా, రైతులకు దూరాభారం అవుతుందని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచితేనే రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నది వారి భావన. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సమాచారం. ఆర్‌బికెల్లో ఎరువులు ఉంచితే వైసిపి మార్క్ పాలన అవుతుందని భావించడం వల్లనే, సొసైటీలకు ఎరువుల వ్యాపారాన్ని మార్చుతున్నట్లు చర్చ నడుస్తోంది. ఏదిఏమైనా సొసైటీల్లోనూ, ఆర్‌బికెల్లోనూ రెండుచోట్ల అందుబాటులో ఉంచితే అన్నదాతకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

ఇది జంగిల్ కాదు.. జగనన్న కాలనీయే..



పేరుకు పారిశ్రామిక ప్రాంతం.. రోజురోజుకు అంతకంతకూ పెరుగుతున్న జనాభా.. పట్టణీకరణతో సుదూర ప్రాంతాల నుంచి అక్కడ బాడుగ ఇండ్లలో గడుపుతున్న చిరుద్యోగులే అక్కడంతా.. వారికి స్థిర నివాసం కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలకు చర్యలు చేపట్టింది. అక్కడ అధికారుల నిర్లక్ష్యమో, అలసత్వమో ఆ పేదల పాలిట శాపంగా మారింది. సుందరంగా తీర్చిదిద్దాలనుకున్న జగనన్న కాలనీ సుమారు పాటు అడవిని తలపిస్తోంది.

- ప్రజాశక్తి-సత్యవేడు

సత్యవేడు మండలం కేంద్రంకి సమీపంలో శ్రీసిటీ పారిశ్రామిక వాడ ఉంది. అక్కడికి వస్తున్న విరుద్యోగులు, ఉపాధి కోసం ఉంటున్న పేదలకు అక్కడ బాడుగ ఇండ్లే గత్యంతరం. వారికి శాశ్వత ప్రాతిపదికన ఇండ్లు నిర్మించి ఇవ్వాలనే సంకల్పంతో గత ప్రభుత్వం జగనన్న కాలనీ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. అందుకు గానూ సమీపంలోని కొత్తమారికుప్పం, కాలమునాయుడుపేట పంచాయతీలో 530 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేసింది. అక్కడ సుమారు 300ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా 50ఇండ్లు పూర్తి కావస్తున్నాయి. 104ఇండ్లు వివిధ దశలలో ఆటంకాలు ఏర్పడి నిర్మాణాలు ఆగిపోయాయి. అక్కడ మౌలిక సదుపాయాలు, రోడ్ల సౌకర్యం కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లుగా స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెనువెంటనే ఇండ్ల నిర్మాణాలకు తగిన ఏర్పాట్లు చేయాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు.



- మౌలిక సదుపాయాలు లేమితో పేదల పాట్లు
- చిట్టడివిని తలపిస్తున్న కాలనీ ప్లాట్లు
- సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారుల వేడుకోలు



ఆశ వలంటీర్ని తొలగించరేం..

- మేం చెప్పింది వినకుంటే సెలవుపై వెళ్లండి
- ఇష్టమొచ్చింది చేయటానికి వీల్లేదు
- మహిళా వైద్యాధికారిపై టీడీపీ నేతల బెదిరింపుల పర్వం

ప్రజాశక్తి-బాలాయపల్లి: అధికారం మాది. ఇప్పుడంతా మేం చెప్పినట్లే జరగాలి.. కాదని ఇష్టం వచ్చినట్లు చేయాలనుకొంటే ఉద్యోగాలకు సెలవు పెట్టి వెళ్లండి.. ఇదీ బాలాయపల్లి మండలంలో టీడీపీ నాయకుల బెదిరింపు దోరణి. బాలయపల్లి మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామానికి చెందిన ఆశ వలంటీర్ కృష్ణవేణిని తొలగించాలని స్థానిక వైద్యాధికారి ప్రమీలపై టీడీపీ నేతలు హుకూం జారీ చేశారు. తాము చెప్పింది చేయలేదనే ఆక్రోశంతో గురువారం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన టీడీపీ నేతలు వైద్యాధికారి ప్రమీలతో వాగ్వివాదానికి దిగారు. అధికారంలో ఉన్న తమను కాదని ఎలా ఉద్యోగ చేస్తారో చూస్తాం.. చెప్పింది వినండి లేకుంటే సెలవు పెట్టి వెళ్లండంటూ బెదిరించారు. దీంతో కన్నీరు పెట్టుకున్న వైద్యాధికారి ప్రమీల స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడి చేరుకున్న పోలీసులు వచ్చినా వారి ముందే వైద్యాధికారిపై టీడీపీ నేతలు మరింతగా రెచ్చిపోయారు. తలచుకొంటే ఉద్యోగాలే లేకుండా చేస్తామంటూ దౌర్జన్యం చేశారు. అక్కడి సిబ్బంది భయభ్రాంతులకు గురైయ్యారు.

సర్పంచ్ చొరవ.. శ్మశాన స్థలం కేటాయింపు



ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండల కేంద్రంలోని పిచ్చాటూరు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి చొరవతో పిచ్చాటూరు టీచర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ శ్మశాన వాటికలకు అధికారులు స్థలం కేటాయించారు. గతంలో ఆ కాలనీలకు ఉన్న శ్మశాన వాటిక భూములను టూరిజం అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో ప్రజలు తమకు వేరే చోట శ్మశాన స్థలం చూపాలని సర్పంచ్ దృష్టికి చెప్పాలని సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి వద్ద మొర పెట్టుకున్నారు. ఆ మేరకు స్పందించిన ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్ శ్మశాన వాటికకు అరణియార్‌లోనే మరో చోట స్థలం చూపినట్లు సర్పంచ్ గురువారం వెల్లడించారు. అధికారులు చూపిన చోటే వినియోగానికి అనుగుణంగా చదును చేసి శ్మశాన స్థలాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మురాజీ, నాగయ్య, మురుగేశ్, బాబు, శేఖర్ పాల్గొన్నారు.

కండలేరు నీటి సరఫరా ప్రారంభం



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి నగర ప్రజలకు అవసరమైన తాగునీరు కోసం కండలేరు నుంచి కె.పి కెనాల్ ద్వారా గురువారం సాయంత్రం కండలేరు నీటి సరఫరాను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ కండలేరు నుంచి నీటి సరఫరా గత కొంతకాలంగా జరగడం లేదని, ఇరిగేషన్ అధికారులకు మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అనుమతితో రూ.85లక్షలను ఇటీవలే కేటాయించడం జరిగిందన్నారు. వారు పూడికతీత పనులు చేపట్టి నీటి సరఫరా సజావుగా సాగేందుకు కెపి కెనాల్ నుంచి నీటి సరఫరాను సిద్ధం చేయడంతో నీటి సరఫరాను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ మంచి నీటిని వృదా చేయవద్దని, అదేవిధంగా కెనాల్ ప్రవహించే ప్రదేశాల నుంచి రైతులు అక్రమంగా నీటి సరఫరాను మళ్లించ వద్దని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నరసింగరావుపేట బాల సదన్‌లో విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. దాతగా క్లబ్ మాజీ అధ్యక్షులు అశోక్ చక్రవర్తి వ్యవహరించారు. క్లబ్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అశోక్ చక్రవర్తి పుట్టిన రోజు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో మునిగిరీష్, దశరధరామిరెడ్డి, పి.వి.కృష్ణయ్య రాజు, చక్రవర్తి, రవీంద్ర రెడ్డి, సురేష్ రెడ్డి, రాంప్రసాద్, జగదీష్ నాయుడు, బలరాం రెడ్డి, మేనేజర్ అరుణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పురపాలక పరిధిలోని చెన్నూరులోని ఎంపీయూపీ పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలు బేటి బచావో- బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ శివ జ్యోతి మాట్లాడుతూ బాలికలను రక్షించడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రమణమ్మ, భువనేశ్వరి, లక్ష్మి, పావని, పాఠశాల హెచ్ఎం సిద్దయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థికి నగదు బహుమతి అందజేత



ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని వెంగళత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థి బి.జ్యోత్స్న ఈ ఏడాది స్కూల్ టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. కాగా గురువారం బంగారుపాళ్యం రిటైర్డ్ ఎంఈవో వరలక్ష్మి, ఆమె భర్త మునికృష్ణ రూ.10వేలు నగదును విద్యార్థి జ్యోత్స్నకు బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా నగదు బహుమతిని అందించినట్లు తెలిపారు. ఏటా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో యుగంధర్ రాజు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి: మోహన ప్రియ

ప్రజాశక్తి-ఏర్పేడు: గ్రామీణులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ మోహన ప్రియ అన్నారు. మండలంలోని ఎండీ పుత్తూరులో గురువారం సర్పంచ్ పర్యవేక్షణలో మురికి నీటి కాలువలలో పూడికతీత పనులు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ వర్షాలకు మురుగు కాలవలలో నీరు నిలవ లేకుండా చూసుకుంటూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి: జేఐహెచ్

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని మండల జమాఅతె ఇస్లామీ హింద్ కన్వీనర్ షేక్ అమీర్ బాషా ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. టీడీపీ ప్రభుత్వంలో తారక రామానగర్ ఏర్పడి సుమారు ఇరవై సంవత్సరాలు కావస్తుంది. ముఖ్యంగా తమ గ్రామంలో స్కూల్ మాత్రమే బాగుందన్నారు. వీధుల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్య అధికంగా ఉందన్నారు. వర్షపు నీళ్లు నిలిచి పిల్లలు, పెద్దలు ఇబ్బంది పడుతున్నారన్నారు. నిరుపేదలే ఎక్కువగా ఉన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరారు.

పాఠశాల దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థులు పాఠశాల దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవడాలని శ్రీకాళహస్తి డిఎస్పి ఉమామహేశ్వర రెడ్డి అన్నారు. స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం నిర్వహించిన ఇన్వర్టర్ సెరమని కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజయ్యారు. విద్యార్థుల్లో దాగున్న నాయకత్వ పటిమను గుర్తించడంలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు తలపెట్టడం గొప్ప విషయం అన్నారు. ఏజీఎం కిషోర్, ఆర్ఐ సురేష్, కళాశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్య, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ చూడామని, ఈ ఛాన్స్ వైస్ ప్రిన్సిపల్ లత, హై స్కూల్ అకాడమిక్ డీన్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాపూరి బాలాజీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: శ్రీ వెంకటేశ పెరుమాళ్ ఇంజనీరింగ్ కాలేజ్ అధినేత వైస్ ఛైర్మన్ రావూరి బాలాజీ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పుత్తూరు బలిజ సంఘం సభ్యులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్‌లు

- టీడీపీ నేత జీవరత్నం నాయుడు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వ అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తోందని టీడీపీ పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు అన్నారు. గురువారం పట్టణంలో అన్న క్యాంటీన్ స్థలాన్ని చదును చేయించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కార్వేటినగరం రోడ్డులో క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. నాయకులు బాబునాయుడు, ఆనంద్, మురళి, లక్ష్మీపతి, సచివాలయ కార్యదర్శి పాల్గొన్నారు.

ఏపీసీసీఈ శిక్షకుడిగా రాజేంద్రుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నాగార్జున యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను మారిన డిగ్రీ మూడో సెమిస్టర్ సిలబస్‌పై శిక్షణ ఇచ్చేందుకు ఏపీసీసీఈ పట్టణానికి చెందిన ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి సంక్రాంతి రాజేంద్రుడును ఎంపిక చేసింది. తిరుపతి జిల్లా నుంచి ఎంపికైన ఏకైక అధ్యాపకులు రాజేంద్రుడు కావడం విశేషం. ఏపీసీసీఈ శిక్షకుడిగా రాజేంద్రుడు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ లత, సహచర అధ్యాపకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

టైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించిన భవ్య

ప్రజాశక్తి-క్యాంపస్: బెంగళూరులోని విద్యారణ్యపురంలో జరిగిన సౌత్ జోన్ టైక్వాండ్ ఛాంపియన్ షిప్‌లో తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల(టిటిడి) ద్వితీయ సంవత్సరం ఎమ్‌పిసి విద్యార్థి పి.భవ్య సీనియర్ బాలికల 58 కేజీ విభాగంలో బంగారు పతకం, ఫోమ్-సి ఇండివిజువల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి, అధ్యాపకులు భవ్యని అభినందించారు. శిక్షణ ఇచ్చిన పిడి సాయి సుమతిని ప్రత్యేకంగా అభినందించారు.

శ్మశాన స్థలాన్ని కాపాడాలని ధర్నా



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కబ్జాకోరుల చెర నుంచి మజ్జిగ గుంట శ్మశాన స్థలాన్ని కాపాడాలని దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామస్తులతో కలిసి పుత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ మజ్జిగగుంట శ్మశాన స్థలం కోసం అనేక ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. 2019లో అప్పటి తహశీల్దార్ తడుకులో సర్వే నెం.168/2లో యాభై సెంట్లు స్థలాన్ని కేటాయించారన్నారు. కాగా ఆ స్థలం చెన్నై-తిరుపతి ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో కబ్జాదారులు కన్నేసి ఆక్రమించారన్నారు. వెనువెంటనే అధికారులు స్పందించి ఆ శ్మశాన స్థలాన్ని కాపాడి, అక్కడ ప్రహరీ నిర్మించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వో సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యానాది కాలనీ వాసులు శివ, తులసీరామ్, కన్నమ్మ, చిరంజీవి, కన్నయ్య, అంజేరయ్య, దేశమ్మ, మణి, గణేష్, రమేష్, శివయ్య పాల్గొన్నారు.

మహిళలతోనే ఆర్థిక పురోగతి సాధ్యం

- యూనియన్ బ్యాంకు మేనేజర్ హరిత



కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తున్న బ్యాంకు మేనేజరు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మహిళలతోనే ఆర్థిక పురోగతి సాధ్యమని పుత్తూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరిత పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక రాస్ కార్యాలయంలో 20మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. 20మంది పొదుపు సంఘాల సభ్యులకు గురువారం శిక్షణ పూర్తయింది. ఆ మేరకు యూనియన్ బ్యాంకు మేనేజరు హరిత చేతుల మీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. రాస్ సంస్థ అధికారి రవి, శోభారాణి, ప్రకాష్, శేఖర్, దివాకర్, జయంతి పాల్గొన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి ఎమ్మెల్యేలకు జాతీయ చేనేత ఐక్యవేదిక వినతి



ఎమ్మెల్యేకి విన్నవిస్తున్న చేనేత ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలకు చెందిన వారు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జౌలిశాఖ మంత్రి సవిత, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డి బాబు వినతి పత్రాన్ని అందించారు. ఈ మేరకు ఏపీ సచివాలయంలో మంత్రి, ఎమ్మెల్యే చాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. త్వరలోనే చేనేతల సమస్యలకు పరిష్కారం చూపుతామని మంత్రి, ఎమ్మెల్యే చెప్పారని చిన్నరెడ్డి బాబు తెలిపారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీయూ ఉన్నతాధికారులకు ఘన సన్మానం



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య యమ్.భూపతి నాయుడుని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతు మురళీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిరువురిని ఉపకులపతి చాంబర్లో శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు వీరారెడ్డి, బాలాజీ, హరి,శివ, ముణి, రమణ, అనీల్, పాపిరెడ్డి, రాముడు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-క్యాంపస్: పిడిఎస్ఓ రాష్ట్ర పిలుపులో భాగంగా జూనియర్ కళాశాల సమస్యల పరిష్కరించాలని పిడిఎస్ఓ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో ఎంఆర్ పల్లి సర్కిల్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్ఓ మహిళా నేత ఆర్.ఆషా మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్రంలో ఇంటర్ కళాశాలలు మౌలిక సదుపాయాలు కూడా లేక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. పాఠ్యపుస్తకాల పంపిణీ లేదని, మధ్యాహ్న భోజన పథకం రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లగా రెగ్యులర్ అధ్యాపకుల నియామకం లేక ఔట్సోర్సింగ్, గెస్ట్, కాంట్రాక్టు లెక్చరర్ల తోట కాలేజీలు నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల ఫీజుల దోపిడీని అరికట్టాలి, పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా జూనియర్ కళాశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు స్రవంతి, విష్ణు మొదలైన జూనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే, బస్ స్టేషన్‌లలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా వ్యాప్తంగా రైల్వే, బస్ స్టేషన్‌లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణ చేయడమే ప్రధాన ధ్యేయంగా కట్టుదిట్టమైన ప్రణాళిక చర్యలు తీసుకుంటున్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ఎన్ఫోర్స్మెంట్ విధులను పెంచి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలన్న ప్రధాన లక్ష్యంతో పనిచేస్తున్నారు.



ఘనంగా ఎస్వీఎంసి వ్యవస్థాపక దినోత్సవం



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఎస్వీ వైద్య కళాశాల 64వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెడికల్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకున్న ప్రతి వైద్య విద్యార్థి, దేశ విదేశాల్లో గొప్ప వైద్య సేవలు అందిస్తూ, కళాశాలకు ఎంతో వన్నె తెచ్చి పెట్టారని తెలిపారు. ఫౌండేషన్ డే ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ ఏపీ వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పంపించిన సందేశాన్ని చదివి అందరికీ వినిపించారు. కార్యక్రమంలో 1964 బ్యాచ్‌కి సంబంధించిన వైద్యాధికారులు డాక్టర్ ప్రేమానంద, ధూమపానం, శ్వాసకోస వ్యాధుల్లో వస్తున్న ఇబ్బందులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వైద్యులకు,వైద్య విద్యార్థులకు, వైద్య సిబ్బందికి క్లుప్తంగా వివరించారు. ఎస్వీఎంసీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వైద్య కళాశాల ప్రాంగణంలో వైద్యుల కొరకు ఫ్యాకల్టీ క్లబ్‌ను పునర్నిర్మాణాన్ని ప్రారంభించారు. వైద్య కళాశాల ప్రాంగణంలో వివిధ రకాలైన చెట్లను నాటారు. కార్యక్రమంలో రుయా ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్, డాక్టర్ డి.ఎస్ మూర్తి, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, డాక్టర్ శీనయ్య, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ చలపతి రెడ్డి, డాక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేట ఎస్ఐపై బదిలీ వేటు

- వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులు
- సివిల్ కేసుల్లో జోక్యం చేసుకున్నందుకే..

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఉన్నతాధికారుల మాటలు.. లెక్కచేయని, సివిల్ మ్యాటర్‌లో జోక్యం చేసుకుంటున్న భాకరాపేట ఎస్ఐ విజయకుమార్ నాయక్‌పై వేటు పడింది. గురువారం ఎస్ఐను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ సుబ్బారాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. భాకరాపేటలో సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోవడం, ఉన్నతాధికారుల ఆదేశాలను పెడచెవిన పెట్టి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై ఎస్పీ సీరియస్ అయ్యారు. ఎస్ఐపై చర్యలకు ఉపక్రమించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన పోలీసుల్లో క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం కలిగేలా నిశ్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

లెప్రసిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ అధికారి శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): లెప్రసీ కేసులపై మరింత అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. గురువారం మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ప్రతి ఇంటికి ఆశా కార్యకర్తలు వెళ్లాలని, సందర్శించిన ఇంటిలో ఎవరికైనా చర్మంపై మచ్చలు ఉంటే అటువంటి వారిని లేప్రసి అనుమానితులుగా గుర్తించి తగిన వైద్య సేవలు పొందేలా సూచనలు ఇవ్వాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యంగా లెప్రసీడ్ ద్వారా అంగవైకల్యం రాకుండా ఆశ కార్యకర్తలు తగిన సహకారాన్ని అందించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి స్రవంతి, ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రణాళిక



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధి సాధించడానికవసరమైన సంపూర్ణ అభివృద్ధి ప్రణాళికా నివేదికను స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం సీఎంను క్యాంపు కార్యాలయంలో కలిసిన సుధీర్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో ఆగిన అభివృద్ధి వివరాలు, వాటి పూర్తికి అవసరమైన నిధులు, ఎన్నికల హామీల అమలు చేయూత గురించి చర్చించారు. స్పందించిన చంద్రబాబు శ్రీకాళహస్తి అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అమరావతి నిర్మాణానికి ఉపాధ్యాయుడి విరాళం



మంత్రి లోకేష్‌కు చెక్కు అందిస్తున్న కృష్ణమ నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి మంగళం ట్రెండ్స్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్న డి.కృష్ణమ నాయుడు రూ.1,01,116లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలసి మంత్రి నారా లోకేష్‌కి అందజేశారు. గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి ఛాంబర్‌లో కలిసి చెక్కును అందించారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, గోవిందరాజులు, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని తొట్టంబేడు మండల ఎంపీపీ ఉన్నం నిర్మలా వాసుదేవ నాయుడు పిలుపునిచ్చారు. తొట్టంబేడు మండలంలోని పోయ్య గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ సక్కుబాయమ్మ, ఉన్నం వాసుదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో సత్య ఇన్ఫోటెక్ జాబ్ మేళా

ప్రజాశక్తి-క్యాంపస్: సత్య ఇన్ఫోటెక్, ప్రముఖ ఐటీ సంస్థ తిరుపతిలోని ఎస్వీయూలోని డిపార్ట్మెంట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) భవనంలో 26 తేదీన ఉదయం 9 గంటలకు ప్లేస్మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తోంది. 24/7 ఏఐతో భాగస్వామ్యంలో ఈ డ్రైవ్‌లో కస్టమర్ సర్వీస్ అడ్వైజర్, డిజిటల్ చాట్ అసోసియేట్ వంటి పదవులను అందిస్తోంది. సత్య ఇన్ఫోటెక్ సీఈఓ గిరీశ్ కుమార్ మాట్లాడుతూ పట్టభద్రులు ఈ ఉద్యోగావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైస్-చాన్సలర్ డాక్టర్ అప్పారావు, రిజిస్ట్రార్ డాక్టర్ భూపతి నాయుడు మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ భూపతి నాయుడు మాట్లాడుతూ "సత్య ఇన్ఫోటెక్ ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ, ఇది విద్యార్థులకు నాణ్యమైన ఇంటర్న్‌షిప్‌లు, పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్వీయూలో భవిష్యత్తులో అన్ని విభాగాలలో అనేక రకాల ఉద్యోగ నియమక డ్రైవ్‌లను నిర్వహించనుంది" అని చెప్పారు.

ఘనంగా ప్రారంభమైన త్యాగరాజ స్వామి ఉత్సవాలు



- ప్రత్యేక ఆకర్షణగా పద్మ విభూషణ్ శివరామన్ సంగీతం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతిలోని టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టు కళామందిరం వద్దనున్న శ్రీ త్యాగరాజస్వామి టెంపుల్ బిల్డింగ్ ట్రస్టులో గురువారం త్యాగరాజస్వామి 80వార్షిక సంగీత, నృత్య ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సభా కార్యక్రమం అనంతరం పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, సంగీత కళానిధి, సప్తగిరి సంగీత విధ్వన్మణీ ఉమ యాలపురం డాక్టర్ కె.శివరామన్ మృదంగం, నిఖిల్ గురుచరణ్ గాత్రం, కొముండూరు కృష్ణ వయోలిన్, డాక్టర్ ఎస్ కార్తీక్ ఘట్టం వీరి బృందం ప్రదర్శించిన సంగీతం మొదటిరోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిరథ మహారథులను ఎంతగానో ఆకట్టుకుంది. శ్రీ త్యాగరాజ ఫెస్టివల్ కమిటీ చైర్మన్ మోహన్ సుందరం, సెక్రటరీ కంచి రఘురాం ట్రెజర్ భానుమూర్తి, సభ్యులు ప్రభాకర్‌లు భవన నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలు పేర్లను స్టేజిపై చదివి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అలాగే అన్ని విధాలుగా టీటీడీ తమకు అండగా నిలుస్తున్నదని కొనియాడారు. ఈ ఉత్సవాలను వెన్నుండి నడిపిస్తున్న ట్రస్టీలు బీమాస్ అశోక్ , తదితరులు పాల్గొనగా.. ప్రధాన ఆకర్షణగా ప్రతిరోజు సంగీత కార్యక్రమాలలో శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ కాలేజీ విద్యార్థులు పాల్గొని సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీ సంగీత కళాశాల డోలు విద్వాంసులు మ్యూజిక్ కాలేజ్ లెక్చరర్ ఆర్.సత్యనారాయణ తోపాటు పలుసంగీత విధ్వంసులు, సంగీత ప్రియులు, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్లో లారీ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల రెండో ఘాట్ రోడ్డులో పెను ప్రమాదం తృటిలో తప్పింది. తిరుపతి నుంచి తిరుమల కొండపైకి వెళ్తున్న లాడీ బోల్తా పడి పిట్టగోడను ఆనుకుని ఆగిపోయింది. ఫుల్ లోడ్‌తో కొండపైకి వెళ్తున్న లారీ నుంచి చక్రాలు విడిపోవడంతో ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్రంగా గాయాలు అయినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఇతర వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

